క్లుప్తంగా

ఇంటి స్థలాలు ఇవ్వాలి



సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ పగడ పూల మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం నగరంలోని 15 డివిజన్ సచివాలయం ఎదుట ఆ సంఘం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ఆ హామీని నెరవేర్చడం లేదన్నారు. అనంతరం సచివాలయం అడ్మిన్‌కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాము, అపర్ణ, చైతన్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి విద్యార్థి లక్ష్యానికి అనుగుణంగా పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నగర ప్రముఖులు డాక్టర్ శ్రీనివాసులు, జేవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎండీ తాహిర్ తెలిపారు. గురువారం కడప నగరంలో ఉమెన్స్ త్రైవ్ ఏపీ ఆర్గనైజేషన్ ఫౌండర్ రషీదా ఆధ్వర్యంలో పలు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పదవ తరగతి తర్వాత జీవితంలో ఎలా స్థిరపడాలి అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ త్రైవ్ ఏపి ఆర్గనైజేషన్ మహేనూర్ ఆయేషా, సుల్తానా, అర్జున్ రెడ్డి తదితరులు పాల్గున్నారు.

ప్రశ్నించే అలవాటు నేర్చుకోవాలి



ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న బాలబయన్న

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే అలవాటు నేర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక కార్యదర్శి బాల బయన్న అన్నారు. గురువారం కడప నగరంలోని శివ శివాని ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు జేవీవీ ఆధ్వర్యంలో ఇంద్రజాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నగర ఉపాధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, పాఠశాల కరస్పాండెంట్ రమణి, జన విజ్ఞాన వేదిక మహిళ విభాగ నాయకురాలు అరుణమ్మ, వెంకటేశ్వర్లు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన అవగాహన కరపత్రాలతో నిర్వాహకులు, విద్యార్థులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం యూనిట్-9, హాండ్స్ ఫర్ యూ స్వచ్ఛంద సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రోగాం ఆఫీసర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా చావు బతుకుల మధ్య ఉన్న వారికి ప్రాణం పోయడమేనన్నారు. హ్యాండ్స్ ఫర్ యు వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టుపోగుల సుబ్బారావు విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించాలి

కమలాపురం : స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలకు చెందిన ఫస్టియర్ విద్యార్థిని చేసుకున్న ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కళాశాలకు చేరుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం గురించి ప్రిన్సిపాల్ తులసమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని చేసుకున్న ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఫిజిక్స్ టీచర్ సుభద్రమ్మను తక్షణం సస్పెండ్ చేయాలన్నారు. గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ల మధ్య రెండు వర్గాలు ఏర్పాటు చేసి వారి మధ్య సుభద్రమ్మ విభేదాలు సృష్టిస్తున్నారని మండి పడ్డారు. సుభద్రమ్మ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పటి నుంచి విద్యార్థినులు ఆత్మ హత్యాయత్నాలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వనాలకు వెళదాం.. భోజనం చేద్దాం

- ఐక్యత, అభిమానాలకు వేదికగా వన భోజనాలు
- చివరి వారం ఉత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

కడప కల్చరల్ : వన భోజనాల పేరు వినగానే కార్తిక మాసం గుర్తుకు వస్తుంది. ఇందులో వన భోజనాలు ప్రత్యేక స్థానం ఆక్రమిస్తున్నాయి. కులానికి చెందిన వారంతా ఐక్యంగా ఊరి వెలుపల ఆహ్లాదకరమైన వనాలలో ఉత్సాహంగా, ఉల్లాసంగా అంతా ఒక్కటే ఆనందాలు, భోజనాలు పంచుకుంటారు. మరో సంవత్సరానికి సరిపడ ఆప్యాయతలు, అనురాగాలు మూటగట్టుకుంటారు. ఏడాదికి ఒకసారి వచ్చే కార్తిక వనభోజనాలు కొన్ని వర్గాల మనుషులను, మనసులను ముడివేసి తీపి జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి. ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి.

ఇటీవల వన భోజనాలను ఎక్కువగా కుల సంఘాలే నిర్వహిస్తున్నాయి. అందులో ఆయా కులాలకు సంబంధించి ఉద్యోగ సంఘాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఉద్యోగులు ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించడం ఈ కార్యక్రమాల ద్వారా కాస్త సులభమవుతుంది. నిజానికి ఈ సంఘాలన్నీ తమ కులాలలో ఐక్యత పెరిగేందుకు అన్నిరకాలుగా తమ కులం అభివృద్ధి చెందేందుకే పాటుపడుతున్నాయి. సంఘాల ప్రతినిధులు ఐక్యత అవసరాన్ని గుర్తించి కులాల వారీగా ఐక్యతను సాధించేందుకు వన భోజనాలను వేదికగా చేసుకుంటున్నారు. మొన్నటివరకు వివాహాలు, కులాల వారీగా ఐక్యతను పెంచేవిగా ఉండేవి. ఆధునికత పెరగడంతో వివాహాలలో కూడా ఆప్యాయత కనుమరుగై ఐక్యతను పెంచలేక పోవడంతో వన భోజనాలే ప్రధాన పాత్ర వహించాల్సి వస్తోంది.

కలిసుందాం...రా!

ఎవరికి వారుగా కుల సంఘాల పేరిట కార్యక్రమాలు నిర్వహించడం ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులను కలిగిస్తూ ఉండడంతో ఐక్యత అవసరాన్ని ఆయా కులాల వారు గుర్తించారు. కార్తిక మాసంలో నిర్వహించే వన భోజనాలను ఐక్యతకు వేదికగా మలిచే అవకాశంగా భావిస్తున్నారు. వన భోజనాల వల్ల ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనతోపాటు ఆరోగ్యం, అంతకుమించి అక్కడ చేరిన వారి మధ్య ఐక్యత పెరిగే అవకాశం ఉండడంతో ఆయా కులాలకు చెందిన వారు కూడా వన భోజనాలకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. ఇంతవరకు వారి మధ్య ఉండిన చిన్న చిన్న విబేధాలు తొలిగి పోతున్నాయి. ఒకరి కోసం ఒకరు అన్న అభిమానం, సహాయ సహకారాలు అందజేసుకునే స్థాయి చనువు పెరుగుతున్నాయి. కుల పరమైన సమస్యలకు వన భోజనాల కార్యక్రమాలలో పరిష్కారాలు లభిస్తుండడం విశేషం. కార్యక్రమాల నిర్వహణకు అందరూ తమ వంతుగా విరాళాలు ఇస్తారు గనుక అందరూ బాధ్యతగా నిర్వహణలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొన్నప్పుడే తమ నిర్వహణ విజయవంతమవుతుందని భావించి చిన్న సమస్యలను పక్కనపెట్టి తమ కులంలోని మిగతా వారందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నారు.



వన భోజనం చేస్తున్న ప్రజలు (ఫైల్)

ఐక్యత పెరుగుతుంది

వన భోజనాల సమయంలో వందలాది మందికి భోజనం ఏర్పాటు చేయవలసి ఉంటుంది. దీనికోసం తెచ్చే కూరగాయలను స్త్రీ, పురుషులు కలిసి తమ బంధుత్వాన్ని గుర్తు చేసుకుంటూ వంటకు సిద్ధం చేస్తారు. మహిళలతో కలిసి మగ వారు సైతం లుంగీలు బిగించి వంట పనిలోకి దిగుతున్నారు. వరుసలు పెట్టి పిలుచుకుంటూ ఆప్యాయంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా భోజనాలు స్వయంగా వండుతారు. బంధువులందరినీ వరుసలుగా కూర్చొబెట్టి పంక్తి భోజనం ఏర్పాటు చేసి ఒకరినొకరు ప్రేమగా వడ్డిస్తారు. వడ్డించింది తినేంత వరకు ప్రేమతో పట్టుబడుతారు. భోజనంతో కాదుగానీ వడ్డించే వారి ఆప్యాయతలతోనే కడుపునిండిపోతుంది. ఈ సంఘటనలన్నీ ఆయా కులస్తుల్లో ఐక్యతకు బీజాలు వేస్తాయి. అందుకే ఇటీవలి కాలంలో క్షత్రియ, భట్రాజులు, బ్రాహ్మణులు, దేవాంగులు, పద్మశాలీయులు, రెడ్లు ఇతర కుల సంఘాలు ఎక్కువగా వన భోజనాలను నిర్వహిస్తున్నాయి. ఇది సమాజానికి కార్తిక మాసం ద్వారా జరిగే మేలుగా భావించవచ్చు. కాలక్రమంలో వన భోజనాలు నగర శివార్లలోని కల్యాణ మండపాలకు పరిమితం కావడం, భోజనాలు కూడా క్యాటరింగ్‌కు బాధాకరం. దీంతో ఆశించిన ఫలితాలు పూర్తి స్థాయిలో లభించడం లేదన్నది కూడా కొందరి వాదన.

గ్రామీణ రహదారులపై టోల్‌ట్యాక్స్ వద్దు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : గ్రామీణ రహదారులపై టోల్ ట్యాక్స్ వసూలు చేయరాదని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామీణ రహదారులపై జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర రహదారులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి, టోల్ ట్యాక్స్ వసూలు చేయడం దారుణం అన్నారు. చంద్రబాబు అసెంబ్లీ వేదికగా ప్రకటించడం ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదన్నారు. గుంతలు పూడ్చడానికి టోల్ ట్యాక్స్ విధించాలనుకోవడం, పైలెట్ ప్రాజెక్టుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో అమలు చేయాలనుకోవడం ×విజనరీ× అనిపించుకోదని ఎద్దేవా చేశారు. ఈ నిర్ణయం పూర్తిగా ప్రైవేటీకరణకు దారులు వేస్తున్నట్లుగా ఉందని విమర్శించారు. రహదారుల మరమ్మతులకు కూడా గ్రామీణ ప్రజల నుంచి పన్నుల పేర వసూలు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఏపీలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, కూటమి అధికారంలోకొస్తే రోడ్లను బాగు చేస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టాక రహదారుల గుంతలు పూడ్చడానికి నిధులు లేవని చెప్పడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, హమాలీలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశంలో ప్రభుత్వం రంగ సంస్థలను కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టే క్రమంలో కేంద్రం తీసుకొస్తున్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 26న జరగనున్న సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైల్వే గూడ్స్ అమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కేసీ బాదుల్లా, మహబూబ్ బాషా విజ్ఞప్తి చేశారు. గురువారం కడప రైల్వేస్టేషన్ ఆవరణలో గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. సమ్మెకు రైల్వే గూడ్స్ షెడ్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ హమాలీ యూనియన్ నాయకులు పాల్, చిన్న ఓబులేసు, శ్రీను, నాగేంద్ర, గంగయ్య, సూరి, సుబ్బారామ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో అసంబద్ధ విధానాలకు స్వస్తి పలకాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖలో అసంబద్ధ విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలకాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామాంజనేయులు అన్నారు. గురువారం కడపలోని ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పని వేళలు పెంచడం శాస్త్రీయ విధానానికి, మనో విశ్లేషణ సిద్ధాంతానికి వ్యతిరేకమన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలో విద్యలో అగ్రస్థానంలో ఉన్న కేరళలో ఉదయం 9-10 నిమిషాల నుంచి సాయంత్రం 3 గంటల వరకు కొన్ని పాఠశాలలు, 10 గంటల నుంచి 4 గంటల వరకు ఉన్నత పాఠశాలలు, మరికొన్ని పాఠశాలలు 7:30 నుంచి 1-30 వరకు నిర్వహిస్తునారన్నారు. విరామ సమయాన్ని తీస్తే అన్ని పాఠశాల గరిష్ట పనివేళలు ఐదు గంటలు మాత్రమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల వేళలు యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ప్రసాద్, చంద్రశేఖర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు.. ప్రమాద కారకాలు



కడప బాలాజీనగర్‌లోని బీసీ బాలికల హాస్టల్



హాస్టల్ ఎదురుగా పెరిగిన పిచ్చి మొక్కలు

- హాస్టల్ వద్ద ముళ్లపొదలు
- పట్టించుకోని సిబ్బంది
- విద్యార్థులకు చిక్కులు

కడప రూరల్ : హాస్టల్ వద్ద పిచ్చిమొక్కలతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖకు చెందిన బీసీ బాలికల హాస్టల్ స్థానిక బాలాజీనగర్‌లో ఉంది. ఇక్కడ దాదాపు 55 మందికి పైగా విద్యార్థినులు ఉంటున్నారు. బుగ్గవంక రక్షణ గోడకు సమీపంలో ఈ హాస్టల్ ఉంది. హాస్టల్ ప్రధాన గేటుకు ఒకవైపున, అలాగే గేటుకు ఎదురుగా ఉన్న బుగ్గవంక ప్రహరీ వైపు ఇలా దట్టంగా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగాయి. ఇందులో విష సర్పాలు ఉంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లోని బాలికలు ప్రాంగణంలో బట్టలు శుభ్రం చేసుకుంటూ ఉంటారు. పరిసరాల్లో తిరుగుతుంటారు. విష సర్పాలు, పురుగుల వల్ల అనుకోని సంఘటన ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? అదీగాక ఆ మార్గం మీదుగానే విద్యార్థినులు స్కూల్‌కు వెళ్లి వస్తుంటారు. పైగా ఇటీవలనే జిల్లాలోని కొన్ని హాస్టళ్లలోకి పాములు వెళ్లి విద్యార్థులను కాటు వేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. పిచ్చి మొక్కలను హాస్టల్ సిబ్బంది తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పిల్లల సంరక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వారు పేర్కొంటున్నారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకుడు శివకుమార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు తక్షణమే జమ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఒకటో తేదీనే జీతాలు జమ చేస్తామని చెప్పారని, కానీ గ్రంథాలయ ఉద్యోగస్తులకు ఇన్ని రోజులు అవుతున్నా చెల్లించలేదన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నగర కన్వీనర్ విజయ్ పాల్గొన్నారు.

వాళ్లపైనే ఎందుకంత మమకారం?

- గత కమిషనర్ ఉన్నప్పుడు ఇన్‌చార్జి ఏఈలుగా 8 మందికి అవకాశం
- తాజాగా మార్కులు, రోస్టర్‌ను పక్కన బెట్టి వారినే కొనసాగించేందుకు మొగ్గు
- రగిలిపోతున్న వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో వార్డు ఎమినిటీస్ సెక్రటరీలకు మున్సిపల్ ఏఈలుగా అధికారాలు కట్టబెట్టే వ్యవహారం తీవ్ర విమర్శల పాలవుతోంది. గత కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఉన్నప్పుడు జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఎక్కువ మందితో ఇళ్లు కట్టించారన్న కారణం చూపి 8 మంది వార్డు ఎమినిటీస్ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈలుగా అవకాశం కల్పించారు. వాస్తవానికి వారు చూపిన ప్రతిభ ఏమీ లేదని... 3వ కేటగిరి కింద కాంట్రాక్టర్లు ఇళ్లు కట్టించి ఇవ్వడం వల్ల అవన్నీ వారి ఖాతాలో పడి ఎక్కువ ఇళ్లు కట్టించిన ఘనత వారికి దక్కిందని మిగతా ఎమినిటీస్ సెక్రటరీలు అంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వారే ఏఈలుగా అధికారం చెలాయిస్తున్నారు. సదరు ఇన్‌చార్జిలు తాము కూడా వార్డు ఎమినిటీస్ సెక్రటరీలమే అన్నది మర్చిపోయి పరీక్షలు రాసి ఏఈలు అయినట్లు ఫీలవుతూ తోటి సెక్రటరీలపై పెత్తనం చెలాయించి వేధించిన సందర్భాలు ఉన్నాయి. ఏఈలు అన్నాక మర్యాదలు, మామూళ్లు.. పర్సెంటీజీలు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లతో పరిచయాలు సర్వసాధారణమే. దీంతో అనతి కాలంలోనే వీరి హవా పెరిగిపోయిందని సమాచారం. వీరిలో ఒకరిద్దరు హౌసింగ్‌లో పెద్ద ఎత్తున సంపాదించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా అనంతపురం ఆర్‌డీఎంఏ కార్యాలయం నుంచి వార్డు ఎమినిటీస్ సెక్రటరీల మార్కుల ఆధారంగా రోస్టర్ పాయింట్ల జాబితా తయారు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ అధికారులు ఏం జాబితా పంపారో... ఏమోగానీ ఇది వరకు కొనసాగుతున్న 8 మందికే ఏఈల అధికారాలు కట్టబెట్టేందుకు చీఫ్ ఇంజినీర్ కార్యాలయం సిద్ధమైపోయింది. దీంతో మిగతా వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు రోస్టర్‌ను కాదని ఆ 8 మందికే ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. మార్కులు, సీనియారిటీ, విద్యార్హతలు, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా భవిష్యత్‌లో పదోన్నతులు ఇచ్చేటప్పుడు కూడా ఇలాగే చేస్తారా.. ఇదేం న్యాయం అంటూ ప్రశ్నిస్తున్నారు. వంద మంది సెక్రటరీల్లో ప్రతిభ కలిగిన వారు ఇంకెవరూ లేరా.. వీరినే మళ్లీ ఏఈలుగా ఎందుకు నియమిస్తున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే వీరితో పని మాత్రమే చేయించుకుంటున్నామని, వారికి అదనంగా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా జీతం పెంచి ఇవ్వడం లేదని నగరపాలక అధికారులు చెబుతున్నప్పటికీ .. జీతం ఎవరికి కావాలి.. అధికారం కదా.. అనే సమాధానం వినిపిస్తోంది. వీరినే తిరిగి ఏఈలుగా నియమించడంలో ఓ ఉన్నతాధికారి, ఒకరిద్దరు కంట్రోల్ సిబ్బంది చక్రం తిప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై మిగతా వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



పుట్టగొడుగులను ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న విద్యార్థినులు

వైవీయూ : పుట్టగొడుగుల పెంపకం ఎంతో లాభదాయకమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. ఆ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో విద్యార్థినులకు పుట్టగొడుగల పెంపకంపై సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 30న ప్రారంభమైన ఈ కోర్సులో శిక్షణ పొందిన విద్యార్థులు మిల్కీ, ఆయిస్టర్, పింక్ ఆయిస్టర్ మష్రూమ్‌ల పెంపకం చేపట్టారు. వాటిని వారు గురువారం ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ పి. సుబ్రమణ్యం, అధ్యాపకులు నాగరత్నమ్మ, అనూరాధ, శాలెం పాల్గొన్నారు.

ఉద్యోగానికి ఎంపిక

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.శశికళ అనే విద్యార్థిని టీసీఎస్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. సలీంబాషా తెలిపారు. ఇటీవల నాలుగు దశల్లో నిర్వహించిన ఎంపికల్లో ఈమె చక్కటి ప్రతిభ కనబరిచి ఉద్యోగానికి ఎంపికై నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం విద్యార్థినికి ఆఫర్ లెటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్లు సుజాత, మెంటార్లు వరప్రసాద్, మంజుల పాల్గొన్నారు.

వారసత్వ సంపదకు నిలయం జిల్లా



యంగ్ ఇంటాక్ సభ్యులతో నిర్వాహకులు

కడప కల్చరల్ : ఘనమైన నిర్మాణ వారసత్వ సంపదకు జిల్లా నిలయంగా నిలిచి ఉందని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆ కళాశాలలో భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ ఇంటాక్ వారసత్వ వారోత్సవాలలో భాగంగా మూడవ రోజైన గురువారం విద్యార్థులకు జిల్లా వారసత్వంపై అవగాహన కల్పించారు. ఇంటాక్ సభ్యులు మంజులాదేవి, సుబహ్ తాహీన్ మాట్లాడుతూ యంగ్ ఇంటాక్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో యువతకు ప్రాధాన్యతనిస్తూ ఇంజినీరింగ్ విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తున్నామన్నారు. శ్రీ రామ్ ఫైనాన్స్ అధికారి శివశంకర్‌రెడ్డి, ఇంటాక్ సభ్యులు బోగాల కొండారెడ్డి యంగ్ ఇంటాక్ క్లబ్‌పై వివరించారు. ఇంటాక్ ప్రచురించిన ప్రత్యేక బులిటిన్‌ను కళాశాల కరస్పాండెంట్ సుదర్శన్‌రెడ్డి ద్వారా ఆవిష్కరింప చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు ఓవీ రెడ్డి, ఇంటాక్ సభ్యులు రాఘవేంద్ర వర్మ, సగవాసి గంగాధర్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



శ్రీనివాసులురెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విశాఖ నగరంలో న్యాయ విద్యార్థిని సామూహిక అత్యాచారం చేసిన నలుగురు నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కామనురు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక లా విద్యార్థిని ఈ సంఘటనను ఎలా ఎదుర్కోవాలో తెలియక ఆత్మహత్యకు ప్రయత్నించిందంటే ప్రభుత్వ, పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకం లేని స్థితి కనిపిస్తోందన్నారు. తిరుపతి జిల్లాలో మూడేళ్ల చిన్నారిని చిదిమేసిన ఘటన మరువకముందే ఈ ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై దాడులు, అత్యాచార ఘటనలు పెరుగుతున్నా పోలీసు వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం దారుణమన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

వైవీయూ : మొక్కలను పెంచడం ద్వారానే కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి బి.స్వరూప, ఫిజికల్ డైరెక్టర్ మదన్‌మోహన్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్‌పై అవగాహన : యాంటీ బయాటిక్స్‌ను అవసరమైన మేర మాత్రమే వినియోగించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ గీతాంజలి, మహమ్మద్ షాహీద్ సూచించారు. గురువారం కళాశాలలో ప్రపంచ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, మైక్రోబయాలజీ అధ్యాపకుడు ప్రకాష్, నారాయణరెడ్డి, చరిత్ర విభాగాధిపతి ఎం.గురుమోహన్ రెడ్డి, బోటనీ విభాగాధిపతి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రేపు కాలాష్టమి పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామమైన శ్రీ కాలభైరవపురం (ఎమ్మెస్ కొట్టాల)లో శనివారం కాలభైరవాష్టమి నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవ స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర సేవ, కుష్మాండ దీపారాధన తదితర పూజాది నిర్వహించనున్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



డీఈవో కార్యాలయ ఏడీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు డీఈవో కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌కు ఏఐటీయూసీ నాయకులు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, వారి నాయకులు కలసి నిరుద్యోగులైన మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చి భయభ్రాంతులకు గురిచేసి తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఏఐటీయూసీ కడప జిల్లా గౌరవ అధ్యక్షులు చాంద్ బాషా, ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు కామాక్షమ్మ, యస్.హాజీవల్లి, వి.మౌహన్, హుస్సేనీ, యస్.కమాల్, ఉమాదేవి, జయలక్ష్మి, రాములమ్మ, సుభాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టండి



మాట్లాడుతున్న ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాలు అరికట్టాలని ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ఫ్లోరెన్స్ నైటింగేల్ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, స్త్రీ శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి ఆదేశాల మేరకు అంతర్జాతీయ దత్తత మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. బాలల హక్కులు, మిషన్ వాత్సల్య ద్వారా బాలలకు అందిస్తున్న సేవలు, బాల్య వివాహాల వల్ల పరిణామాలు, ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, చెడుస్పర్శలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ కమ్ ప్రొహిబిషన్ అధికారి సునీతరాజు, ఎస్ఐసీ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ ప్రతిరూప్, కౌన్సిలర్ మహేశ్వర, శిశు గృహ మేనేజర్ కుమారి, సోషల్ వర్కర్లు పద్మిని, ప్రసన్న, విజయకుమార్, కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘంలో సభ్యులుగా చేరాలి

కడప ఎడ్యుకేషన్ : ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వాన్ని పొందాలని అసోసియేషన్ నాయకులు కోరారు. గురువారం కడప నగరంలోని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ నగర శాఖ అధికారులు, ఉద్యోగులను అసోసియేషన్‌లో సభ్యులుగా చేర్పించి సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీనాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి పి.సైలేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులు బాదుల్ల, పద్మనాభరావు, మహమ్మద్ ఘోస్, నాగముని తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బృందం

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్, మల్కాజ్‌గిరి మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హనుమంతరావు ఆలయ ప్రదక్షిణ నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ వారికి సాదర స్వాగతం పలికి అమ్మవారి వద్ద ప్రార్థనలు చేయించారు. అర్చకులు వారికి వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.